క్లుప్తంగా

సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు

కొడంగల్ రూరల్: సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి జి తులసి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ మిషన్ ఏడీబీల్ ఆయిల్స్-ఆయిల్ సీడ్స్ పథకం కింద పెద్దనందిగామ, పర్సాపూర్ గ్రామాలను ఎంపిక చేశారని ఆమె పేర్కొన్నారు. బ్లాక్ లెవల్ డెమాన్స్ట్రేషన్‌కి 25హెక్టార్లు, వాల్యు చెయిన్ క్లస్టర్(వీసీసీ)కి 50హెక్టార్లు కేటాయించారని తెలిపారు. బీఎల్‌డీ రైతులు ఒక్కో 20కిలోల బ్యాగును రూ.1,280 చెల్లించి తీసుకోవాలని సూచించారు. వీసీసీ వేరుశనగ విత్తనాలు ఉచితంగా వంద శాతం సబ్సిడీతో అందించనున్నట్లు తెలిపారు. సోమవారం పెద్దనందిగామ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో, మంగళవారం పర్సాపూర్ గ్రామంలోని రైతువేదికలో టోకెన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు తీసుకునే వారు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, సంబంధిత సర్వే నంబర్ యొక్క మట్టి నమూనా, ఎఫ్‌పీఓ సభ్యత్వం (రిజిస్ట్రేషన్) తీసుకొని రావాలని తెలిపారు.

నిండుకుండలా అల్లాపూర్ చెరువు

కాల్వలకు మరమ్మతులు చేయాలని వినతి



తాండూరు రూరల్: మండల పరిధిలోని అల్లాపూర్ చెరువు నిండుకుండలా మారింది. భారీ వర్షాలు కురవడంతో వర్షపు నీరు చెరువులోకి చేరాయి. దీంతో చెరువు నీటితో కళకళలాడుతుంది.

చెరువు కింద కాల్వలు..

అల్లాపూర్ చెరువు కింద కాల్వలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువు కింద కాల్వలను మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

గ్రామస్తుల శ్రమదానం

వాగులోనుంచి చెత్త తొలగిస్తున్న ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సుధాకర్



చెత్త తొలగిస్తున్న సుధాకర్ తదితరులు

బంట్వారం: మండల పరిధిలోని నూరుల్లాపూర్ వాగులో బంట్వారం గ్రామస్తులు ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ఇక్కడ వంతెన లేకపోవడంతో నూరుల్లాపూర్ వాగు చిన్నపాటి వర్షానికే రోడ్డు పైనుంచి పారుతుంది. వాగులో వేసిన సిమెంటు పైపులకు చెత్త అడ్డు తగలడంతో నీరు సాఫీగా వెళ్లడంలేదు. దీన్ని గమనించిన బంట్వారం ఇందిరమ్మ కమిటీ సభ్యుడు దోరేటి సుధాకర్ గ్రామస్తులతో కలిసి శ్రమదానం నిర్వహించి చెత్తా, చెదారం తొలగించారు. ఈ సందర్భంగా వారిని వాహనదారులు, స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిరాములు స్వామి, పాపయ్య, కృష్ణ, ఏసు తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగసమందర్‌లో వైద్య శిబిరం

ధారూరు: మండల పరిధిలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆదివారం డాక్టర్ జ్యోతి తెలిపారు. ఈ శిబిరంలో ఈఎన్‌టీ, ఆర్థో, గైనిక్, మానసిక రోగాలతో పాటు సాధారణ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వైద్యులు మౌనిక, దివ్య, ప్రశాంతి, హిమబిందు ఈ పరీక్షలు చేయనున్నారని జ్యోతి పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

సీనియర్ న్యాయవాది ఆనందం



మాట్లాడుతున్న ఆనందం

దోమ: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీనియర్ న్యాయవాది కడుమూర్ ఆనందం పేర్కొన్నారు. ఆదివారం కొండాయపల్లి గ్రామంలో ఈ నెల 28న నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపనకు సంఘం నాయకులు, మేధావులతో కలిసి శాంతి చైతన్య పాదయాత్ర నిర్వహించారు. కొండాయపల్లి గ్రామం నుంచి పరిగి పట్టణం వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆయా పార్టీల, ప్రజాసంఘాల నేతలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విగ్రహ ఆవిష్కరణకు ఆయా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆలయాలు ముస్తాబు



హస్నాబాద్‌లో ముస్తాబైన దుర్గామాత మండపం

- నేడు కొలువు దీరనున్న దుర్గామాత
- గ్రామాల్లో సిద్ధమవుతున్న మండపాలు
- ఏర్పాట్లు పూర్తి చేసుకున్న నిర్వాహకులు

దుద్యాల్: మండలంలోని పోలేపల్లి గ్రామంలో స్వయంభూగా వెలసిన రేణుక ఎల్లమ్మ దేవాలయంలో దేవి శరన్నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా నిత్యం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిత్యం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమం వంటివి నిర్వహిస్తారని తెలిపారు. అమ్మవారికి పూజలు చేయాలనుకునే భక్తులు ఒక రోజు ముందుగానే ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దుర్గామాతను ఏర్పాటు చేసే నిర్వాహకులు మండపాలను సిద్ధం చేసే పనిలో నిమజ్ఞమయ్యారు. గ్రామాల్లో ఇటీవలే వినాయక చవితి ఉత్సవాలు ముగిశాయి. వెనువెంటనే దేవి శరన్నవరాత్రులు ప్రారంభంకానుండడంతో గ్రామాల్లో భక్తి పారవశ్యంతో పాటు సందడి వాతావరణం మొదలుకానుంది.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..

అనంతగిరి: ఆయా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో, నియమ నిష్ఠలతో సోమవారం నుంచి నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా తెల్లవారుజామునుంచే సుప్రభాతసేవతో ప్రారంభించి ప్రత్యేక అభిషేకం, అర్చన, లలిత సహస్రనామార్చన, హోమం, సామూహిక భజనలు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు ఇప్పటికే పూర్తి చేశారు. అమ్మవారు నిత్యం ఓ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనుంది. వికారాబాద్ చుట్టూ పక్కలా గ్రామాలతో పాటు మున్సిపల్ పరిధిలోని వైభవలక్ష్మి ఆలయం, రాంమందిరం, మల్లికార్జున ఆలయం, శివారెడ్డిపేటలోని తుల్జా భవానీ మాత ఆలయం, కమలానగర్ మహాలక్ష్మి ఆలయం, వెంకటపూర్ తండాలో వెలసిన అమ్మవారి ఆలయంలో, ఆయా వాడల్లో సైతం అమ్మవారిని ప్రతిష్ఠించనున్నారు.



అనంతగిరి: వికారాబాద్‌లోని వైభవలక్ష్మి ఆలయంలో వెలసిన అమ్మవారు

ఈ మట్టి మా ఊరిసొత్తు

- టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు
- పోలీస్ స్టేషన్‌కు తరలింపు

బొంరాస్‌పేట: ఈ మట్టి మా ఊరిసొత్తు అని అనుమతులు లేకుండా తవ్వించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న టిప్పర్లను ఆదివారం కొత్తూరు గ్రామానికి చెందిన ప్రజాసంఘాల నాయకులు, ఇతరనాయకులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామశివారులోని మాలగుట్ట మట్టిని రోడ్డు వేయాలని పరిగి, ఇతర ప్రాంతాలకు, తరలించొద్దని హెచ్చరించారు. ఇదే అదనుగా భావించి మరి కొందరు మట్టి వ్యాపారం చేసుకోవడం తగదన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న వడిచర్ల బీటీ రోడ్డు పనులను కాలయాపన చేస్తు కాంట్రాక్టర్‌లు మట్టి వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ఎవరైనా సరే ఇక్కడినుంచి మట్టి తరలిస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

అనుమతులు లేకుండా..

అనుయతి లేకుండా మాలగుట్టను తవ్వించి మట్టిని తరలిస్తున్న యంత్రాలను, వాహనాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి, కేఎస్‌పీఎస్ నాయకులు గ్రామస్తులు అడ్డుకున్నారు. అనంతరం టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కె.చంద్రయ్య , కేఎస్‌పీఎస్ జిల్లా నాయకులు లక్ష్మయ్య, కుర్వ హక్కుల పోరాట సమితి బాలప్ప, బాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, యువజన సంఘాల నాయకులు రవి, ప్రభు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న నేతలు

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు ముదిరాజ్, వైద్యులు షోయబ్ ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం ముజాహిద్‌పూర్ గ్రామంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వారు అవగాహన కల్పించారు. అనంతరం వారు కిడ్నీ సంబంధిత వ్యాధులపై వచ్చే సమస్యల గురించి వివరించారు. కిడ్నీ సమస్యలతో పేదలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ప్రతీరోజు నీరు ఎక్కువగా త్రాగకపోవడం, మద్యపానం, ధూమపానం, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం తదితర కారణాల వల్ల సమస్యలు తలెత్తుతాయని వివరించారు. స్వచ్ఛతను పాటిస్తూ వేడిచేసి చల్లార్చిన నీటిని ఎక్కువగా త్రాగడం వల్ల కొంతవరకు కిడ్నీ సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రభూపాల్, ఖాజ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నషాముక్త్ భారత్‌కు కృషి

జీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్



3కే రన్‌కు బయలుదేరిన నాయకులు

మొయినాబాద్‌రూరల్: నషాముక్త్ భారత్ చేయడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ గుండె, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆదివారం డ్రగ్స్ రహిత భారత లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో 3కే రన్ కార్యక్రమం నగరంలో నిర్వహించారు. దీనికి మొయినాబాద్ మండలం నుంచి బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున బయలుదేరారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పరిపాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని వారు చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, మధుసూదన్ రెడ్డి, జ్ఞానేశ్వర్, నర్సింహారెడ్డి, రాజమల్లేష్, శివకుమార్, రవీందర్‌రెడ్డి, అశోక్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యుద్ధవిద్యలు అవసరం

ఎస్ఐ ప్రణయ్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎస్ఐ ప్రణయ్

షాద్‌నగర్: విద్యార్థులు యుద్ధ విద్యల్లో రాణించాలని ఎస్ఐ ప్రణయ్ సూచించారు. ఆదివారం పట్టణంలోని యూనిక్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జిల్లాస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఎస్ఐ ప్రణయ్ మాట్లాడుతూ... ఆపద సమయంలో ఎదుటి వారి నుంచి తమను తాము రక్షించుకునేందుకు కరాటే, కుంగ్‌ఫూ ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థికి తల్లిదండ్రులు విధిగా యుద్ధ విద్యలను నేర్పించాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్లు అహ్మద్‌ఖాన్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురిసె.. పంటలు మునిగె



చాకలిగూడలో మొక్కజొన్న పంటలోకి చేరిన వర్షం నీరు

మొయినాబాద్‌రూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, కుంటలు నిండుకుండల్లా కళకళలాడుతున్నాయి. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లో వరద నీరు చేరుకుంది. శ్రీరామ్‌నగర్-వెంకటాపూర్ గ్రామాల మధ్యలో గల చిన్న వాగు వంతెనపై నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అదే విధంగా చాకలిగూడ, వెంకటాపూర్ రహదారి పక్కన మొక్కజొన్న పంటలో భారీగా వర్షం నీరు చేరింది.

ధారూరులో భారీ వర్షం



కురుస్తున్న వాన

ధారూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొద్దిసేపు మబ్బులు ఏర్పడి చీకటిని తలపించడంతో లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చిందని వాహనదారులు పేర్కొన్నారు.

జీఎస్టీతో ప్రజలకు మేలు

జీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ భారతాన్ని జీఎస్టీ సంస్కరణలు మార్చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. పన్నుల మార్పులు మాత్రమే కాకుండా పశుపోషణ, మత్స్యకార వృత్తి, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ కుటుంబాల జీవనోపాధిపై నేరుగా ప్రభావం చూపుతుందన్నారు. ఇప్పటి వరకు రైతులు ఉపయోగిస్తున్న పరికరాలపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వచ్చిందని, ప్రధాని నరేంద్రమోదీ తీసుకువచ్చిన కొత్త సంస్కరణల ద్వారా ఐదు శాతానికి తగ్గిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ నిర్ణయం అందరికి ఆదర్శంగా ఉందన్నారు.

వీసా ఫీజు పెంపుతో విద్యార్థులకు నష్టం

చేవెళ్ల: అమెరికా ప్రభుత్వం ప్రకటించిన హెచ్-1బీ వీసా ఫీజు పెంపు నిర్ణయం సరైంది కాదని బీజేపీ చేవెళ్ల యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యువ విద్యార్థులైన ఐటీ, వైద్యులు, ఇంజనీర్లు వంటి ప్రతిభావంతులకు భారీ ఆర్థిక భారంగా మారుతుందన్నారు. మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల అమెరికా కలలను సాకారం చేయటంలో అడ్డంకిగా మారిందన్నారు. అలాగే నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 3కే రన్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నంతో పాల్గొన్నానని చెప్పారు.

ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని కట్టమైసమ్మ, పోచమ్మ దేవాలయంవద్ద అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాత జీటీ.సంతోష్, శ్యామల దంపతుల సహకారంతో ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతినెల అమావాస్యను పురస్కరించుకొని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు భిక్షపతి, అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షులు సంతోష్, రమేష్, కోశాధికారి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి జంగరాజ్, ప్రచార కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బావి

- బాయిమీది తండాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనులు
- కంచె ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి
- పట్టించుకోని అధికారులు



రక్షణలేని బావి

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం బాయిమీది తండాలో చేదు బావి ప్రమాదకంగా మారింది. తండాలోని ఓ కిరాణ దుకాణం వద్ద పురాతనమైన బావి ఉంది. దీన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రస్తుతం అది వాడుకలో లేకపోవడంతో వృథాగా మారింది. అంతేకాకుండా బావి చుట్టూ కంచే ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా తయారైంది. అటుగా వచ్చే వాహనదారులు, స్థానికులు ముఖ్యంగా చిన్నారులు భయాందోళన ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి స్పందించి బావిచుట్టూ కంచె ఏర్పాటు చేయించాలని కోరతున్నారు.

రబీ సాగు పనులు మొదలు

జోరుగా వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతులు



ట్రాక్టర్ సహాయంతో వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతులు

దుద్యాల్: మండల వ్యాప్తంగా రైతులు రబీ సాగు పనుల్లో నిమజ్ఞమయ్యారు. వర్షాలు జోరుగా కురుస్తుండడంతో రైతులు ఇది వరకే పొలాలను చదును చేసుకున్నారు. దీంతో ప్రస్తుతం ఉత్తెర కార్తె కావడంతో చదును చేసిన పొలాల్లో వేరుశనగ విత్తనాలు విత్తుకునే పనిలో బిజీగా మారారు. మరి కొంత మంది చదును చేసుకుని విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ట్రాక్టర్ల సహాయంతో విత్తనాలు వేస్తుండగా మరి కొంత మంది ఎద్దుల నాగళ్లతో విత్తనాలు నాటుకుంటున్నారు. విత్తనాలు విత్తుకునే సమయం కాబట్టి విత్తనాలతో పాటు సంబంధిత ఎరువులు కొనుగోలు చేసేందుకు ఫర్టీలైజర్ షాపుల చుట్టూ తిరుగుతున్నారు. వేరు శనగ విత్తనాలను ప్రైవేట్ వ్యాపారుల వద్ద రైతులు కొనుగోలు చేస్తున్నారు. మండల పరిధిలోని హకీంపేట్, పోలేపల్లి, హస్నాబాద్ తదితర గ్రామాల్లోని ప్రైవేట్ రైస్‌మిల్లర్ల వద్ద అందుబాటులో ఉన్నట్లు సమాచారం. అక్కడి నుంచి రైతులు విత్తనాలు తీసుకుకెళ్తున్నారు.

బతుకమ్మ సంప్రదాయానికి ప్రతీక

తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ. ఈ పర్వదిన వేడుకలను పురస్కరించుకుని ఆదివారం వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో ఎంగిలిపూల బతుకమ్మ ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో మహిళలు బతుకమ్మను పేర్చి అనంతరం గౌరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అందరూ ఒక చోట చేరి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం చేశారు.



పరిగి: పట్టణ కేంద్రంలో..



అనంతగిరి: బతుకమ్మ ఎత్తుకున్న యువతి



సర్పన్‌పల్లి ప్రాజెక్టులో నిమజ్జనం చేస్తున్న మహిళ

దత్తాత్రేయుడి సన్నిధిలో కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: కర్నాటక రాష్ట్రం గానుగాపూర్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ దత్తాత్రేయస్వామి దేవాలయాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డిలు ఉన్నారు.

ట్రిపుల్ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

షాద్‌నగర్: ట్రిపుల్ఆర్ అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే మార్చాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎస్.రాజు డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పరిధిలోని అయ్యవారిపల్లి, చించోడ్, భీమారం, ఉప్పరిగడ్డ తండాల మీదుగా రీజనల్ రింగ్ రోడ్డును నిర్మించే ప్రాంతాలను ఆదివారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడి పంట పొలాలను సందర్శించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. రైతులు పంటలు పండించే పచ్చని పంట పొలాల గుండా రోడ్డును నిర్మించడం సరికాదన్నారు. పాడి పంటలు, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు సుమారు 300 ఎకరాల భూమిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం గతంలో చేసిన మార్కింగ్ ప్రకారమే రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రతిఒక్కరూ గోమాతను పూజించాలి



గోపూజలో వాసవీ, వనితాక్లబ్ సభ్యులు

వాసవీ క్లబ్ అధ్యక్షుడు కల్వ మాణిక్యం

షాద్‌నగర్‌రూరల్: సకల దేవతల నిలయమైన గోమాతను ప్రతిఒక్కరూ పూజించాలని వాసవీక్లబ్ అధ్యక్షుడు కల్వమాణిక్యం అన్నారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకొని పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలోగల శ్రీకృష్ణ గోశాలలో ఆదివారం వాసవీ, వనితాక్లబ్ ఆధ్వర్యంలో గోపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని అన్నారు. గో సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వనితాక్లబ్ అధ్యక్షురాలు కల్వమధుప్రియ, వాసవీ క్లబ్ కోశాధికారి సురేష్ కుమార్, జోన్ చైర్మన్ వెంకటరమణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులుగుప్తా, సభ్యులు నందకిషోర్, మురళి, రవికుమార్, పాండు, శ్రీనివాస్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.